సాక్షి

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



జాగ్రత్తగా ముందుకు 'సాగు'

మిరప మొక్కలు నాటడానికి ముందు, నాటే సమయం, పంట తొలిదశలో సస్యరక్షణ చర్యలు పాటించాలని మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి తెలిపారు. - 8లో▸



మహిళ వేషధారణలో చోరీకి యత్నం

- 8లో▸

మహిళ వేషధారణలో వచ్చిన ఓ యువకుడు ఇంట్లో చోరీకి యత్నించగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు.

గరిష్టం/కనిష్టం

32^{0} /26^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా సురేశ్



భూపాలపల్లి రూరల్ : సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా భూక్య సురేశ్ నాయక్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గిరిజన మహాసభలో సురేశ్ నాయక్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో లంబాడీలకు తాను చేసిన సేవలు గుర్తించి రెండో సారి జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు చెప్పారు.

విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడిగా..



సంతోష్ నాయక్

భూపాలపల్లి రూరల్ : సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడిగా గుగులోత్ సంతోష్ నాయక్‌ను నియమించినట్లు సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు చిన్నబాబు నాయక్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలో సంతోష్ నాయక్ ఎన్నికను ప్రకటించి నియామక పత్రం అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు ప్రేమ్‌చంద్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్‌కు సంతోష్ నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిధులు కేటాయించాలి



చిట్యాల : వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని శాంతినగర్‌లో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు నచ్చే విధంగా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులు, చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్‌లను తీసుకు రావడం దుర్మార్గమని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మోత్కూరి రాయకొమురు, అశోక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న జయంతిని జయప్రదం చేయాలి



భూపాలపల్లి రూరల్ : జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జయప్రదం చేయాలని నిర్వహణ కమిటీ నాయకుడు గాజర్ల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని సంఘమిత్ర కళాశాలలో సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని జిల్లా, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడారు. పాపన్న పోరాటస్ఫూర్తితో బహుజనులంత ఐక్యంగా తమ సమస్యలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం

భూపాలపల్లి రూరల్ : వరంగల్‌లో పనిచేస్తున్న జర్నలిస్ట్ గెట్టుకొప్పుల యుగేందర్ రెడ్డి, అతని కూతురు అధ్యరెడ్డి ఆత్మహత్యకు పాల్ప డగా శనివారం జర్నలిస్టు సంఘాల నాయకులు స్థానిక కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో సంతాపం తెలిపి నివాళులర్పించారు. వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ ఎన్నిక



రాఘవారెడ్డి

చిట్యాల : భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీని మండల కేంద్రంలో శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు కొడెల సమ్మయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నవాబుపేటకు చెందిన మందల రాఘవారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సాంబయ్య, కుమార్, కార్యదర్శిగా రవీందర్, సహాయ కార్యదర్శిగా జగన్‌మోహన్, తోట నరహరి, సేంద్రియ ప్రముఖ్ రాంరెడ్డి, సుభాష్ చంద్ర బోస్, సూరినేని జనార్దన్‌రెడ్డి, కోశాధికారిగా సదా శివరెడ్డి, ప్రచార ప్రముఖ్ అర్షం రాజు, మహిళ ప్రముఖ్ సరోజనను ఎన్నుకున్నారు.

ఉన్నత చదువు.. పోలీసు కొలువు

ఉన్నతంగా చదువుకున్నారు.. ఏదో ఒక జాబ్ చేయాలనుకుంటే వారికి ఐదంకెల జీతం వస్తుంది. కానీ.. ఖాకీ చొక్కా ధరించాలని, దేశ సేవ చేయాలని కలలు కన్నారు. అందుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎంటెక్, బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, పీజీ చదివిన మహిళలంతా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లుగా కొలువు సాధించి శిక్షణ పొందుతున్నారు. కఠోర తర్ఫీదును తట్టుకుని గమ్యం వైపు ప్రయాణిస్తున్నారు. మరో మూడు నెలల్లో వీరి శిక్షణ పూర్తికానుంది. ఈ నేపథ్యంలో మహిళా శిక్షణార్థులు, పోలీసు శిక్షణ కేంద్రంపై ఈ వారం సండే స్పెషల్.

- ఖిలా వరంగల్



సండే స్పెషల్

క్రమశిక్షణలో కఠినం

మహిళా కానిస్టేబుల్ ఉద్యోగం రాగానే.. 9 నెలల పాటు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల వారికి మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో తర్ఫీదు ఇస్తారు. నిత్యం పరేడ్, జంప్‌లు, వెపన్ ట్రైనింగ్, రన్నింగ్, చట్టాలపై అవగాహన, సెక్షన్‌లు, నేర సమీక్ష విభాగం, ఇంటెలిజెన్స్ ఇతరత్రా విభాగాలపై శిక్షణ కొనసాగుతుంది. ఎవరైనా క్రమశిక్షణ తప్పితే కఠినంగా వ్యవహరిస్తారు. తమ ఉద్యోగ జీవితాన్ని నిలబెట్టడంలో పీటీసీది ప్రత్యేక స్థానం అని శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు చెబుతున్నారు.



పీటీసీలో శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులు

బీటెక్, ఎంటెక్, ఎంబీఏ చదివిన వారే అధికం

- 9 నెలల శిక్షణ.. అన్ని అంశాల్లో మెళకువలు
- పీటీసీలో 1,154 మంది ఏఆర్, సివిల్ మహిళా కానిస్టేబుళ్లకు ట్రైనింగ్

పోలీస్ కొలువులో ఒత్తిడి ఉంటుందని తెలిసినా.. మహిళలు ఇష్టంగా స్వీకరిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది ఈరంగంలో రాణిస్తూ.. తమదైన ముద్ర వేసుకుంటున్నారు. పోలీస్ ఉద్యోగానికి కనీస అర్హత ఇంటర్మీడియట్ అయినప్పటికీ.. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ చేసిన అభ్యర్థులు సైతం పోటీ పడి కొలువులు సాధించారు. అందుకు సంబంధించిన శిక్షణ పొందుతూ వృత్తిలో నిబద్ధత చాటుకుంటున్నారు.



శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు

కఠోర శిక్షణ..

వరంగల్ నగరంలోని మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల (పీటీసీ) ఉమ్మడి రాష్ట్రంలోనే ఉన్నతమైన ట్రెనింగ్ కళాశాలగా పేరుపొందింది. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 32 మంది కానిస్టేబుల్ ఉద్యోగాన్ని వదిలేసి ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోగా.. ఇక్కడ ప్రస్తుతం సివిల్ 849 మంది, ఏఆర్ 305 మంది మొత్తం 1,154 మంది శిక్షణ పొందుతున్నారు. వీరంతా మహిళా కానిస్టేబుళ్లు కావడం విశేషం. గతేడాది 1,186 మంది ఏఆర్, సివిల్ మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పొందారు. ప్రస్తుతం కొనసాగుతున్న శిక్షణ ఫిబ్రవరి 21న ప్రారంభమై నవంబర్ 20న ముగియనుంది. వీరు మరో మూడు నెలల్లో శిక్షణ పూర్తిచేసుకొని విధుల్లో చేరనున్నారు.



అనేక అంశాలు నేర్చుకుంటున్నా..

మాది సూర్యాపేట జిల్లా కర్విరాల కొత్తగూడెం. డీఈడీ పూర్తయ్యింది. పోలీస్ ఉద్యోగంపై ఉన్న మక్కువతోనే ఇందులో చేరా. శిక్షణ కఠినంగా ఉన్నా ఇష్టంతో చేస్తున్నాం. ఇప్పటికే అన్ని విభాగాల్లో పట్టు సాధించా. నూతన చట్టాలు, నేరాల నివారణ, ఇతర కొత్త అంశాలు నేర్చుకుంటున్నా. ప్రస్తుతం పీటీసీలో శిక్షణ చాలా బాగుంది.

- నలమాస భవాని, సివిల్ కానిస్టేబుల్ శిక్షణార్థురాలు

పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం..



నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ డ్రెస్ అంటే ఇంతో ఇష్టం. ఈవృత్తిపై ఇష్టంతోనే కానిస్టేబుల్ ఉద్యోగాన్ని పట్టుదలతో సాధించాను. వృత్తిపై నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేస్తాను. వరంగల్ పీటీసీలో పొందుతున్న శిక్షణ ఉన్నత స్థానంలో నిలుపుతుంది. ఈ శిక్షణ జీవితంలో మర్చిపోలేను.

- కె.వందన, ఏఆర్ కానిస్టేబుల్ శిక్షణార్థురాలు, జగిత్యాల

రాటుదేలుస్తున్నారు..



మాది ఖమ్మం. ఇక్కడి సార్లు, పీటీసీ మేడం మమ్మల్ని అన్ని విషయాల్లో రాటుదేలుస్తున్నారు. మార్షల్ ఆర్ట్స్, స్విమ్మింగ్, డ్రైవింగ్, ఆయుధ ట్రెనింగ్, ట్రాఫిక్ డ్రిల్, ఆర్మ్‌డ్ డ్రిల్, కంప్యూటర్, ఈ లెర్నింగ్ సెంటర్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

- పి.హేమలత, ఖమ్మం, సివిల్ కానిస్టేబుల్ శిక్షణార్థురాలు

మెరికల్లా తయారు చేస్తున్నాం..



పోలీస్ శిక్షణ కళాశాలలో మంచి శిక్షణ అందిస్తున్నాం. పోలీసు వృత్తి అంటేనే బాధ్యతాయుతమైంది. మేం ఇక్కడ ఇచ్చే శిక్షణను బట్టే కానిస్టేబుళ్ల పనితీరు ఉంటుంది. దేశంలోని అంతర్గత భద్రత కోసం మెరికల్లా తయారు చేయడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. మహిళా అభ్యర్థులకు ప్రత్యేక వసతులు కల్పించి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణార్థులను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నాం. ఈ బ్యాచ్‌కు నవంబర్ 20వ తేదీన నిర్వహించే దీక్షత్ పరేడ్‌తో శిక్షణ పూర్తవుతుంది.

- ఇంజారపు పూజ, పోలీస్ కళాశాల ప్రిన్సిపాల్, మామునూరు

ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు

- వీడియోకాన్ఫరెన్స్‌లో సింగరేణి అధికారులతో సీఎండి బలరాం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏరియా జీఎం, అధికారులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను సీఎండీ బలరాం ఆదేశించారు. సీఎండీ బలరాం సింగరేణి డైరెక్టర్లతో కలిసి శనివారం అన్ని ఏరియాల జీఎంలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో ప్రమాదాలు జరగకుండా పని స్థలాలలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ సభ్యుల నుంచి సలహాలను సూచనలను తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్, అధికారులు వెంకటరామిరెడ్డి, ప్రసాద్, క్రాంతికుమార్, అన్ని గనుల ఏజెంట్లు, సంక్షేమ అధికారులు, గనుల సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భూపాలపల్లి అర్బన్ : అవయవ దానంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని నేత్ర, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వర్ లింగం అన్నారు.జిల్లా కేంద్రంలోని తేజస్విని గాంధీ కళాశాలలో జిల్లా కన్వీనర్ కామిడి సతీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సమావేశానికి ఈశ్వర్‌లింగం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరణానంతరం ప్రతి ఒక్కరూ నేత్ర, శరీర అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి మరణానంతరం నేత్ర, శరీరాన్ని తప్పనిసరిగా దానం చేసేందుకు సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. అప్పట్లో కాళోజీ నారాయణరావు మరణానంతరం తన పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నేత్ర, శరీర అవయవ దాన కమిటీలను ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక వైద్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు చల్లా రామ్ కళ్యాణ్, డాక్టర్ ఉమాదేవి, మల్లారెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, రాజమౌళి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవర్ధన్, సంజీవరావు పాల్గొన్నారు.

సమరయోధులను స్మరించుకోవాలి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రేగొండ : స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగపూరి రాజమౌళి, జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎందరో మహానుభావుల త్యాగఫలంతో సిద్ధించిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి భారతీయుడు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలుసాని తిరుపతిరావు, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, సర్వ కుమారస్వామి, బుచ్చిరెడ్డి, పెండ్యాల రాజు, గాలిఫ్, దెయ్యాల కిరణ్, కొడగాని రాకేష్, విక్రమ్,శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి బాగుపడలే..

ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా అభివృద్ధి పనులు

- మన ఊరు–మన బడి పనుల ఊసేలేదు
- అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి అంతంతే
- నిధులు లేక ముందుకు సాగని పనులు



కాటారంలోని ఎస్సీ కాలనీలో పిల్లర్ల దశలో నిలిచిన ప్రాథమిక పాఠశాల భవనం పనులు

కాటారం: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆచరణలో కనబడటం లేదు. గత ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా పలు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి వంటి మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

'మన ఊరు - మన బడి' ఊసే లేదు..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 2021డిసెంబర్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్ నిర్మాణాలతో పాటు తాగునీటి, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 420 పాఠశాలల్లో 149 పాఠశాలలను అధికారులు ఎంపిక చేసి సంబంధిత పనులను ప్రారంభించారు. రెండు సంవత్సరాల్లో కేవలం 49పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తవగా మిగితా చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. బిల్లుల చెల్లింపు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలో ఆపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల్లో ఐదు రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో మన ఊరు–మన బడి ఊసే లేకుండా పోయింది. ఆ కార్యక్రమం కింద చేపట్టిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాటారం ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవన పనులు ప్రారంభించారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు..	
మండలాలు	- 12
ప్రాథమిక పాఠశాలలు	- 310
ప్రాథమికోన్నత	- 41
ఉన్నత పాఠశాలలు	- 69
మొత్తం విద్యార్థులు	- 24,710

రెండేళ్లుగా పనులు పిల్లర్ల దశలోనే ఉండిపోగా అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతోంది. కాటారం మండలం చిద్నెపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. మల్హర్ మండలం తాడిచెర్ల ప్రభుత్వ హైస్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిస్థితి అంతంతే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో గ్రామైఖ్య సంఘాల సహకారంతో అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట అభివృద్ధి పనులకు పూనుకుంది. జిల్లాలో 265 పాఠశాలలు ఎంపిక చేసి మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పన లాంటి పనులు చేపట్టారు. వీటి కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభానికి ముందు పనులు పూర్తికావాల్సి ఉండగా పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ పలు పాఠశాలల్లో నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 187 పాఠశాలల్లో పనులు జరిగినట్లు అధికారుల లెక్కలు చెప్పుకొస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మొదటి విడతగా రూ.3.10 కోట్ల నిధులు మాత్రమే విడుదల కావడంతో అంతమేర మాత్రమే కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. బిల్లుల చెల్లింపు జరిగితేనే పనులు ముందుకు సాగే అవకాశాలు ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



మల్హర్ మండలం తాడిచెర్ల జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం

పనులు పూర్తయ్యేలా చూస్తాం..



జిల్లాలో మన ఊరు –మన బడి ద్వారా పలు పాఠశాలల్లో చేపట్టిన పనులు పలు కారణాలతో నిలిచిపోయాయి. వీటిని తిరిగి కొనసాగించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన పలు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో మాత్రమే పనులు చివరి దశలో ఉన్నాయి. వాటిని సైతం త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి కృషి చేస్తున్నాం.

- రాజేందర్, ఇన్‌చార్జ్ డీఈఓ, జయశంకర్ భూపాలపల్లి

హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారిని ఐజీ తరుణ్‌జోషి శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులు,స్నేహితులతో కలిసి ఆలయానికి వచ్చిన ఐజీకి పూజారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. గోత్ర నామాలతో అర్చనలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.



హేమాచలుడిని దర్శించుకున్న ఐజీ, స్నేహితులు

నేడు అనుమానిత బాలుడిని అప్పగించనున్న సీడబ్ల్యూసీ

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ రైల్వే పోలీసులకు ఈనెల 2వ తేదీన 9 నెలల బాలుడితో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అతడిని విచారించి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. సంబంధిత అధికారులు సీడబ్ల్యూసీ ఎదుట బాలుడితో తండ్రిని హాజరుపరచగా బాబుకు ఒంటి నిండా దద్దులు ఉండడంతో వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు.ఈలోగా బాబు తండ్రిగా చెప్పుకుంటున్న సదరు వ్యక్తి వివరాలు సేకరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ దగ్గరలోని నార్నూర్ గ్రామానికి చెందిన ఆడెపు సంతోశ్‌గా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చి కేసును ఉట్నూర్‌కు బదిలీ చేశామని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ తెలిపారు. ఆదివారం బాలుడిని తండ్రి సంతోశ్, అన్నదమ్ముల సమక్షంలో వారికి అప్పగిస్తామన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

రామన్నపేట : వరంగల్ బస్టాండ్‌లో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న హనుమకొండకు చెందిన గాదె శ్రీనివాస్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. శ్రీనివాస్.. ఏపీ, ఒడిశా బార్డర్‌లోని సీలేరు సమీపంలో గంజాయి కొనుగోలు చేసి విక్రయించడానికి వరంగల్ బస్టాండ్‌కు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ వద్ద నుంచి రూ. 33,250 విలువైన 1,350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివకుమార్ పేర్కొన్నారు.





జాగ్రత్తగా ముందుకు ‘సాగు’..

మిరప నాట్లలో ముందస్తు చర్యలు తీసుకోవాలి

- అప్పుడే చీడపీడలు నశించి మొక్కల్లో ఎదుగుదల ఉంటుంది
- మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు
- రైతులకు పలు సలహాలు, సూచనలు


మిరప నారును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాంబాబు


రాంబాబు


మాలతి

సాగుబడి

మహబూబాబాద్ రూరల్ : మిరప.. రైతులకు సిరులు కురిపించే పంట. మార్కెట్‌లో అత్యధిక ధర పలికే పంటల్లో ఇదీ ఒకటి. అయితే రైతులు అధిక దిగుబడులు సాధించాలనే తపనతో పెట్టుబడి భారీగా ఖర్చు చేస్తున్నారు. అయినా నారు మడి దశ నుంచి పైరు చివరి దశ వరకు పలు రకాల చీడపీడలు ఆశించి రైతులను విపరీతంగా నష్టపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మిరప మొక్కలు నాటడానికి ముందు.. నాటే సమయం.. పంట తొలిదశలో కొన్ని ముందు జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు పాటించాలని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు తెలిపారు. ఈ మేరకు వారు మిరప రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

- నారు తీయడానికి వారం మందు సెంటు నారు మడికి (40 చదరపు మీటర్లు) 80 గ్రాముల ఫిప్రోనిల్ గుళికలు చల్లాలి. ఈ గుళికల ప్రభావంతో రసం పీల్చే పురుగులు నివారించబడి నారు ఏపుగా పెరుగుతుంది.
- నాటడానికి ముందు నారు వేర్లను కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా ట్రైకోడెర్మావిరిడి 5 గ్రాములతో పాటు 20 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో 20 నుంచి 30 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేస్తే తొలి దశలో ఆశించే చీడపీడలు నివారించబడుతాయి.
- నారు నాటడానికి ముందు వైరస్ తెగుళ్లు, చీడపీడలు ఆశించిన మొక్కలను గుర్తించి వేరుచేసి నాశనం చేయాలి.
- 30 నుంచి 35 రోజుల వయసు గల నారు నాటుకుంటే మేలు. వీలైనంత వరకు ముదురునారు నాటకుండా ఉంటే మంచిది.
- నారు నాటే ముందు పైరు చుట్టూ 2 నుంచి 3 వరుసల్లో జొన్న లేదా మొక్కజొన్న విత్తనాలను ఒత్తుగా విత్తుకోవాలి. దీంతో కలుపు మొక్కలను ఆవాసాలుగా చేసుకున్న వైరస్ తెగుళ్లు, రసం పీల్చే పురుగులు మిరప మొక్కలను ఆశించకుండా ఈ పైరు అడ్డుకుంటుంది.
- మిరప చేనులో లేదా గట్లపై ఎకరాకు 15 నుంచి 20 బంతి మొక్కలతో పాటు ఆముదం మొక్కలు వేసుకోవాలి.
- బంతి మొక్కలు శనగపచ్చ పురుగును, ఆముదం మొక్కలు పొగాకు లద్దె పురుగును ఆకర్షించి పురుగుల ఉధృతిని మిరప పంటపై పడకుండా చూస్తాయి.
- మిరప ప్రధాన పొలంలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 2 నుంచి 3 క్వింటాళ్ల వేపపిండి వేయాలి. తద్వారా భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి కొన్ని రకాల సూక్ష్మపోషకలోపాలు, చీడపీడలు అదుపులో ఉంటాయి.
- సేంద్రియ, రసాయనిక ఎరువులను సమన్వయంతో వినియోగిస్తే భూసారం క్షీణించకుండా అధిక ఉత్పత్తి సాధించొచ్చు.

రసాయనిక ఎరువులు...

- హెక్టార్‌కు 300 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరంతో పాటు 120 కిలోల పొటాష్‌ను ఇచ్చే ఎరువులను అంటే 650 కిలోల యూరియా, 375 కిలోల సూపర్‌తోపాటు 200 కిలోల పొటాష్ వేయాలి.
- ఆఖరి దుక్కిలో హెక్టార్‌కు 75 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అంటే 165 కిలోల యూరియా, 375 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- జింక్ లోపం నివారణకు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో మిగిలిన ఎరువులతో కలపకుండా విడిగా వేయాలి.
- 4 కిలోల ట్రైకోడెర్మావిరిడిని 100 కిలోల పశువుల పెంట, 10 కిలోల వేపపిండితో కలిపి కొద్దిగా తడి ఇచ్చి గోనె సంచులు కప్పి నీడలో 10 రోజులు నీడలో మాగనివ్వాలి.
- మధ్య మధ్యలో 2 నుంచి మూడు సార్లు పైకి కిందికి కలియగలిపి నీటితడి ఇస్తే పెంట మొత్తం తెల్లని శిలీంధ్ర బూజులా పెరుగుతుంది.
- ఇలా తయారైన దానిని నాటు సమయంలో నేలలో వేసి కలియదున్నుకోవాలి.
- ఇలా ప్రధాన పొలంలో తొలిదశలో 2 నుంచి మూడు సార్లు వేస్తే మిరపలో వేరు కుళ్లు, ఎండు తెగుళ్లను కలుగజేసే హానికర శిలీంధ్రాలు నశిస్తాయి.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మామునూరు: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని, విద్యార్థులు 2013 మే 01 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన, ఎన్‌ఐఓఎస్ బీ సర్టిఫికెట్ కోర్సు చదువుతున్న విద్యార్థులు అర్హులున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు www.navodaya.gov.in వెబ్ సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో విద్యార్థి తల్లి/తండ్రి కచ్చితంగా వెంట ఉండాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ సెంటర్ 0870-2556573, 79810176658, 9182925129 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ కోరారు.

25న జిల్లా స్థాయి చెస్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-09, 19 బాలబాలికలకు చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలబాలికలను త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు అండర్-09 క్రీడాకారులు జనవరి01, 2015 నుంచి 2024 మధ్య, అండర్-19 క్రీడాకారులు జనవరి 01, 2005 నుంచి 2024 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

- రైల్వే బ్లాక్‌తో అధికారుల నిర్ణయం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా ఈ నెల 13వ తేదీ నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం రాత్రి తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్‌లో జరిగే రైల్వే ట్రాఫిక్ వర్క్స్‌తో వయా నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా ప్రయాణించే ఈ రైళ్లను కాజీపేట మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు.

దారి మళ్లించి నడిపే రైళ్లు ఇవే..

ఈ నెల 13న సికింద్రాబాద్-సంత్రగచ్చి (07221) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-పూణె (22882) ఎక్స్‌ప్రెస్ వయా కాజీపేట, వరంగల్ మీదుగా, ఈ నెల 11 వ తేదీన సంత్రగచ్చి-సికింద్రాబాద్ (07222) ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇండిపెండెన్స్ డే స్పెషల్ ట్రైన్స్..

ఇండిపెండెన్స్ డే సందర్భంగా కాజీపేట మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

హైదరాబాద్-సంత్రగచ్చి ఎక్స్‌ప్రెస్..

ఈ నెల 14న హైదరాబాద్-సంత్రగచ్చి (07069) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 07.30 గంటలకు చేరుతుంది. అదేవిధంగా ఈ నెల 15న సంత్రగచ్చి-హైదరాబాద్ (07070) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 15.30 గంటలకు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, పలాస, బెరంపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జైపూర్, కెంజర్ రోడ్, భద్రాక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఇద్దరి దుర్మరణం
- జానకీపురంలో ఘటన


అమరేందర్ రెడ్డి (ఫైల్)


మల్లారెడ్డి (ఫైల్)

ధర్మసాగర్ : బైక్‌ను ఓ టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన ధర్మసాగర్ మండలంలోని జానకీపురంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన గురిజాల మల్లారెడ్డి(55).. సోదంపెల్లి అమరేందర్ రెడ్డి అలియాస్ అక్కిరెడ్డి(43)కి మేనబావ అవుతాడు. శనివారం వీరు బైక్‌పై ధర్మసాగర్ వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ధర్మసాగర్ నుంచి పీచర వైపు వస్తున్న పీచర వెంకట శ్రీ స్టోన్ క్రషర్‌కు సంబంధించిన టిప్పర్ లారీ జానకీపురం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో మల్లారెడ్డి, అమరేందర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో డ్రైవర్ టిప్పర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తరలించారు. మల్లారెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, అమరేందర్ రెడ్డికి భార్య రజిత ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుల బంధువు రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, పీచర వెంకట శ్రీక్రషర్‌కు చెందిన టిప్పర్ లారీలు రోజూ ఇదే రహదారిపై అతివేగంతో వెళ్తుంటాయని గ్రామస్తులు తెలిపారు.

బుక్ స్టాల్‌లో రెండోసారి చోరీ

- మొదటి రోజు రూ. 2లక్షలు అపహరణ..

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్టు రోడ్డు వై జంక్షన్ సమీపంలోని శ్రీనివాస బుక్ స్టాల్‌లో దొంగలు మూడు రోజుల్లో రెండు సార్లు చోరీకి పాల్పడ్డారు. బుక్ స్టాల్ యజమాని గందె శ్రీనివాస్ కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలోని శ్రీనివాస బుక్ స్టాల్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. షట్టర్ తాళాలు ధ్వంసం చేసి క్యాష్ కౌంటర్‌లోని రూ. 2లక్షల నగదు అపహరించారు. దీనిపై పోలీసుల విచారణ కొనసాగుతుండగా శుక్రవారం అర్ధరాత్రి మరో సారి చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం షాపు వద్ద వెళ్లగా షట్టర్ తాళాలు ధ్వంసం చేసి కనిపించాయి. మ రోసారి చోరీ జరిగి ఉంటుందని భావించిన శ్రీనివాస్.. క్లూస్ టీమ్‌తోపాటు మిల్స్ కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో మిల్స్‌కాలనీ ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య.. క్లూస్‌టీమ్‌తో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని బుక్ స్టాల్‌ను పరిశీలించి బాధితుడిని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ సీసీ ఫుటేజీ, ఆధారాలు సేకరించింది. ఈఘటనలో నగదు, ఇతర వస్తువులేవి చోరీకి గురికాకపోవడంతో శ్రీనివాస్ ఊపిరి పీల్చుకున్నాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ఆస్తి కోసం బాబాయి హత్య

- అన్న కుమార్తె నిర్వాకం..

ఏటూరునాగారం: ఆస్తి కోసం అన్న కుమార్తె బాబాయిని హత్య చేసింది. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఓడవాడలో జరిగింది. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గావిటీ రాములు(60) మద్యం మత్తులో ఈ నెల 6వ తేదీన రాత్రి10 గంటలకు ఇదే గ్రామానికి చెందిన తన పెద్దన్న కూతురు ఎనకి సారక్కను దుర్భాషలాడారు. ఈ క్రమంలో రాములును అంతమొందించి తన ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో ఇదే అదునుగా భావించిన సారక్క, ఆమె పిన్ని కూతురు ఎడం సరిత, సారక్క కుమారుడు శివ.. రాములును కర్రలతో చితకబాదారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాములును తన రెండో అన్న కూతురు దగట్ల సోమలక్ష్మి ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ రాములు శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై దగట్ల సోమలక్ష్మి ఫిర్యాదు మేరకు సారక్క, శివ, సరితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాణ్యమైన పత్తికి డిమాండ్

- తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి


ఆల్ ఇండియా కాటన్ కాన్ఫరెన్స్‌లో కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: నాణ్యమైన పత్తికి గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని, తద్వారా రైతులు, వ్యాపారులు, మిల్లు యాజమానులకు అధిక లాభాలు వస్తాయని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఇండియన్ కాటన్ ఫెడరేషన్, ఇండియన్ కాటన్ అసోసియేషన్ ఈ నెల 9, 10వ తేదీల్లో సంయుక్తంగా నిర్వహించిన ఆల్ ఇండియా కాటన్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్రం నుంచి కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కక్కిరాల రమేశ్ పాల్గొన్నారు. చివరి రోజు శనివారం జరిగిన సమావేశంలో గతేడాది కాటన్ (పత్తి) క్రాప్ ఎంత వచ్చింది.. ఇంత వినియోగమైంది.. రాబోవు సీజన్‌లో క్రాప్ అంచనాతో పాటు సీసీఐ కొత్తగా ప్రకటించిన ఎంఎస్‌పీ, పంట ఉత్పత్తులు, అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పంట ఉత్పత్తులు, వచ్చే సీజన్‌పై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎగుమతిదారులు, దిగుమతిదారులు, స్పిన్నింగ్‌మిల్స్ యాజమానులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ వేషధారణలో చోరీకి యత్నం

- యువకుడికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత
- కేసముద్రంలో ఘటన


మహిళ వేషధారణలో వచ్చి చోరీకి యత్నించిన యువకుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు, స్థానికులు

కేసముద్రం: మహిళ వేషధారణలో(పంజాబీ డ్రెస్) వచ్చిన ఓ యువకుడు.. ఓ ఇంట్లో చోరీకి యత్నించగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ శనివారం ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్ శివారు కిష్టాపురం కాలనీలోని ఓ ఇంట్లోకి ఓ యువకుడి మహిళ వేషధారణలో చొరబడ్డాడు. తాళం పగులగొడుతున్న క్రమంలో బయటకు వెళ్లి వచ్చిన ఆ ఇంటి యజమానురాలు అతడిని గమనించి ఎవరంటూ ప్రశ్నించింది. దీంతో సదరు యువకుడు తన చేతిలో ఉన్న కొడవలిని చూపిస్తూ డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. యజమానురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అతడిని విచారించారు. తన పేరు సోనమ్‌పఠాన్ అని, తన ఊరు నాందేడ్ అని తెలిపారు. రైలులో వచ్చి ఇక్కడ దిగానని, తనతో ఇద్దరు వ్యక్తులు వచ్చారన్నారు. దీంతో స్థానిక రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అతడి వెంట ఎవరు వచ్చారనే విషయాన్ని పోలీసులు ఆరాతీశారు. ఎవరూ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పంపుసెట్ ఆన్‌చేయబోయి..

- వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి
- కడారిగూడెంలో ఘటన


చెల్మారెడ్డి(ఫైల్)

వర్ధన్నపేట: పంపుసెట్ ఆన్‌చేయబోయి వ్యవసాయబావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కడారిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగాల చెల్మారెడ్డి(65) ఆర్ఎస్సైగా రిటైర్డ్ అయ్యారు. తన స్వగ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పంపుసెట్‌ను ఆన్‌చేయబోయి బావిలో జారి పడ్డారు. సమీపంలోనే ఉన్న రైతులు గమనించి బావిలో పడిన చెల్మారెడ్డిని చూసి వెంటనే కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది వ్యవసాయ బావి వద్దకు వచ్చి చెల్మారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు ఆస్ట్రేలియాలో ఉన్నట్లు తెలిసింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠాలు బోధిస్తూ.. పాత్రల్లో నటిస్తూ

బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్న ప్రభుత్వ టీచర్ చెడపాక రాములు

- సినిమా పాటల రచయితగా, సింగర్‌గా, నటుడిగా రాణింపు
- తాజాగా ‘నేను కీర్తన’ సినిమాకు గీత రచన
- 9న ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రాములు


‘నేను కీర్తన’ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సినిమా యూనిట్‌తో చెడపాక రాములు

విద్యారణ్యపురి: చెడపాక రాములు.. ఓ వైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అంకితభావంతోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే.. మరోవైపు సమయం లభించినప్పుడు, సెలవురోజుల్లో తనకు ఇష్టమైన సినిమా రంగంలో పాటలు రచించడం.. పాడడం.. నటిస్తూ బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రాములు పాటలు రాయడంతోపాటు ఆయాపాటలను సొంతంగా ఆల్బమ్‌ల రూపంలో వెలువరించారు. జానపద గేయాలతోపాటు వివిధ సినిమాలకు పాటలు రాసిన రాములు.. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ‘ది స్కూల్’పేరిట సినిమా నిర్మిస్తున్న ఆయన.. రెండో షెడ్యూల్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్మించబోతున్నారు.

తాజాగా ‘నేను కీర్తన’ సినిమాలో ఓ పాట..

తాజాగా ‘నేను కీర్తన’ అనే సినిమాలో చెడుపాక రాములు ఓ పాట రాశారు ‘ సీతాకోకై ఎగిరింది మనసే’ అనే పాట రాశారు. ఈనెల 9న రాత్రి ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించారు. నిర్మాత కేఎస్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈవెంట్‌ను ప్రారంభించారు. ఇందులో రాములు కూడా పాల్గొన్నారు. ఈ సినిమాలో సీహెచ్ రమేశ్‌బాబు హీరోగానటించడంతోపాటు దర్శకత్వం వహించారు. ఎంఎల్ రాజా మ్యూజిక్ అందించగా రుషిత హీరోయిన్‌గా నటించారు. చిమట ప్రొడక్షన్ ద్వారా ఈ సినిమా ఈనెల 30న విడుదల కాబోతుంది.

అటు టీచర్.. ఇటు రచయిత

2002లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రాములుకు చిన్నప్పటి నుంచే రచనలపై ఆసక్తి ఉంది. దీంతో 1998లో శివామృతం, 1999లోమణికంఠ మణిహారాలు నమోస్తుతే, అయ్యప్పశరణం, ఓసెనా మరదలు, పిల్లా సక్కెన, గాజవాక పిల్ల, బస్సెక్కు, శబరి దండు, సమ్మక్క సాలరమ్మ, జాతరకు తరలి పోదామా, నా తెలంగాణ నేల వంటి ప్రైవేట్ ఆల్బమ్‌లను రచించటంతోపాటు ఆయనే ఆలపించడం విశేషం. మాజీ సీఎం కేసీఆర్ జీవితచరిత్రతో తీసిన బయోపిక్ సినిమా ‘ఉద్యమ సింహం’ సినిమాల్లో రాములు ఐదు పాటలు రాశారు. సోగ్గాడే శోభన్ కృష్ణ సినిమాలో నాలుగు పాటలు రాశారు. ఈ సినిమాలో ఓ పాత్రలో నటించారు కూడా. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో స్థితిగతులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఇతివృత్తంగా ‘ది స్కూల్’ పేరిట సినిమాను సొంతంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తికాగా రెండో షెడ్యూల్ ఈఏడాది సెప్టెంబర్‌లో నిర్మించబోతున్నారు. తాను ఏపాఠశాలలో విధులు నిర్వర్తించినా విద్యార్థులను వివిధ రకాలుగా ప్రోత్సహిస్తున్నారు.

అవార్డులు..

రాములు 2016లో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.కళారత్న, ఉగాది పురస్కారం, ఎక్స్‌లెన్స్ అవార్డు, ప్రైడ్ ఇండియా అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు.

రచయితగా రాణించాలని ఉంది



విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే ఖాళీ సమయాల్లో పాటలు రాస్తున్నా. సినిమారంగంలో పాటల రచయితగా రాణించాలని ఉంది. తాజాగా ‘నేను కీర్తన’ సినిమాలో కూడా ఓ పాట రాశా. ఇప్పటికే రెండు సినిమాల్లోనూ పాటలు రాశా. మరిన్ని సినిమా అవకాశాలకోసం చూస్తున్నా.

– చెడపాక రాములు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు : ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. రెండో శనివారం కావడంతో భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. జలపాతం జలధారలు వీక్షించడంతో పాటు సెల్ ఫోన్లలో బంధించారు. సెల్ఫీలు దిగి ఎంజాయ్ చేశారు.


జలపాతం వద్ద పర్యాటకులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

KUDA PLOTS FOR SALE

రాంపూర్ ORR నుండి పెండ్యాల (NH 163) వెళ్లే 60ft రోడ్డుకి Kuda Layout Plots కేవలం Rs.7500/- sq.yard. 1 Year EMI Facility పూర్తి వివరాలకు: 9553182182. [WA-1239833]

PLOT FOR SALE

మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశల చౌరస్తా నుండి & జ్యోతిభాపులె ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263 అమ్మకానికి. 9032111600. [W-1242430]

SERVICES

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 8331878592. [WA-6517]

అతి తక్కువ వడ్డీతో ఇల్లు వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. సంప్ర॥ 8897402935. [W-1242432]

FINANCE SERVICES

సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్ 9666142226. [W-1239823]

WANTED

Wanted Asst. Doctor, Accountant, Pharmacist, Financial Counselor (with Hosp. Exp), Nursing Staff (GNM, B.Sc Nur.) & Typist Walk in Interview. Cont: 7337313271, 9949499959. [WA-13998]

Urgent Required Backend Executive (Back Office Operations) Day Shift, Preferred Female, Salary 15K. Cont: 9618290901 HNK. [WA-13997]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

Aptivine Vertex Consultanting Private Limited: Wanted a Receptionists - 4, Verification Executives-4. Qlf: Inter or Degree. Cell: 9533680353, Warangal. [W-1239762]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి +భోజనం. జీతం. 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

వరంగల్ ఆఫీస్‌లో పనిచేయుటకు స్టాఫ్/ పార్ట్ టైమ్ స్టాఫ్ కావలెను. 9848073605 [HA-03226]

హనుమకొండ లోనే ప్రముఖ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో హౌస్ కీపింగ్ పనిచేయుటకు జెంట్స్ & లేడీస్ కావలెను 9 గం'' డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్+ESI+PF సంప్ర: 9032153413 [H-796668]

ఈ పేజీలో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ :9010144453
వరంగల్ :9705748198
నర్సంపేట :9553955722
జనగామ :9951602871
మహబూబాబాద్ :9010144453
పరకాల :9010299096
జయశంకర్ భూపాలపల్లి :9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.